www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 6 సెప్టెంబర్ 2024

సిపిఎం సీనియర్ నేత ఆర్ఎస్‌కు నివాళి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

సిపిఎం సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఆర్.సత్యనారాయణరాజు (ఆర్ఎస్) (97) గురువారం కన్నుమూశారు. ఆయనకు భారత కమ్యూనిస్టు పార్టీ అన్నమయ్య జిల్లా కమిటీ తరపున నివాళులర్పిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు తెలిపారు. సత్యనారాయణరాజు అనారోగ్యంతో పశ్చిమ గోదావరి జిల్లాభీమవరంలో మరణించారన్నారు. సుధీర్ఘ కాలం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా సిపిఎం కార్యదర్శిగా పని చేశారని అన్నారు. రైతు, వ్యవసాయ కార్మికులు, అట్టడుగనున్న ప్రజలకోసం జీవితాంతం కృషి చేసిన గొప్ప యోధుడు అన్నారు. సంపన్న కుటుంబంలో పుట్టి పేదల కోసం జీవితాంతం త్యాగం చేసిన గొప్ప కమ్యూనిస్టు అని కొనియాడారు. ఆయన మృతి శ్రామిక జనానికి తీరని లోటు అన్నారు. పార్టీ జిల్లా కమిటీ సంతాపం తెలియచేస్తుందని, ఆర్ఎస్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం ప్రకటిస్తున్నట్లు వివరించారు. ఆర్ఎస్ ఆశయ సాధనకు పోరాటం ఉధృతం చేయడమే ఆయనకు ఘన నివాళని పేర్కొన్నారు.

గురువులు సమాజ నిర్మాతలు : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

విజ్ఞానాభివృద్ధికి గురువు పునాదిలాంటివారని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అన్నారు. గురువారం పట్టణంలోని లయగార్డెన్స్ హాలులో మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ శ్రీధర్, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథరెడ్డి, డిఇఒ శివ ప్రకాష్‌రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి సర్వేపల్లి చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పురాతన కాలం నుంచి సమాజంలో గురువును స్మరిస్తూ వారి ప్రాముఖ్యతను, విద్య పూర్తయిన తర్వాత గురువును సత్కరించే చక్కని సంస్కారం కలిగిన సమాజం మనదన్నారు. భావిభారత భవిష్యత్తును తీర్చిదిద్దే గురువులను వారి సేవలను గుర్తించుకొని సన్మానించడం మనందరి కర్తవ్యమని తెలిపారు. జిల్లాలో విద్య నాణ్యత పెంచడానికి పట్టణ, మండల, గ్రామీణ పాఠశాలల అంతరాలను తగ్గించడానికి ఉపాధ్యాయులు చేస్తున్న కృషికి అభినందనలు తెలిపారు. విద్య అనేది కేవలం నేర్చుకోవడం కాకుండా సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచనలు, విలువలు పెంపొందించడం అనేది ఒక ముఖ్యమైన భాగమన్నారు. 21వ శతాబ్దంలో మనం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యుగంలో ముందుకు వెళ్తున్నామన్నారు. నేటి తరం విద్యార్థులకు అవసరమైన డిజిటల్ లెర్నింగ్, నూతన టెక్నాలజీల పట్ల మారుతున్న అవసరాలను ఉపాధ్యాయులు నిరంతరం వారి నైపుణ్యాలను పెంపొందించుకొని వాటిని విద్యార్థులకు అందించడం చాలా అవసరమని పేర్కొన్నారు. జీవిత ప్రయాణంలో విజ్ఞానం, జ్ఞానం, జీవిత విలువలతో మన మార్గాలను ప్రకాశింపజేసే మార్గదర్శక దీపాలు ఉపాధ్యాయులన్నారు. రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి మాట్లాడుతూ సర్వేపల్లి ఆశయాలను ఆదర్శంగా తీసుకొని ఉపాధ్యాయులందరూ భావిభారత నవ సమాజ స్థాపనకు కృషి చేయాలన్నారు. గురువులు విద్యాభివృద్ధికి పాటుపడి అబ్దుల్ కలాం లాంటి ఎంతోమంది మహనీయులను తీర్చిదిద్దారని చెప్పారు. డిఇఒ శివప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో విద్యాభివృద్ధికి, విద్యా ప్రమాణాలు నాణ్యతకు పాటుపడుతున్న ఉపాధ్యాయులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికైన వారందరితోపాటు మిగిలిన ఉపాధ్యాయులందరూ కూడా విద్య ప్రమాణాలు పెంచేందుకు మరింత బాధ్యతగా కృషి చేయాలని కోరారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా 81 మంది ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను కలెక్టరు, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథరెడ్డి ఘనంగా సత్కరించి, జ్ఞాపిక, ప్రశంస పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, డిప్యూటీ డిఇఒలు, మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయ సంఘ నేతలు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సర్వేపల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ శ్రీధర్, అధికారులు

ఉత్తమ ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న కలెక్టర్ శ్రీధర్, ఎమ్మెల్యే ఆకేపాటి

విఒఎల తొలగింపును ఆపాలి : సిఐటియు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

విఒఎ (యానిమేటర్ల) తొలగింపులు ఆపాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు అన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని ఎఒకు ఎపి వెలుగు విఒఎ ఉద్యోగుల సంఘం (సిఐటియు) ప్రతినిధులు గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యనిమేటర్ల మీద పీలేరు, రాయచోటి, తంబళ్లపల్లి నియోజకవర్గాల్లో కలకడ, కెవిపల్లి, చిన్నమండెం, గాలివీడు మండలాల్లో రాజకీయ వేధింపులు అధికమయ్యాయని పేర్కొన్నారు. కనీసం పద్ధతులు పాటించకుండా తొలగిస్తుంటే సెర్ప్, డిఆర్‌డిఎ అధికారులు చేష్టలుడిగి చూస్తున్నారే తప్ప కూటమి నేతల అక్రమాలకు అడ్డు చెప్పే ధైర్యం చేయడంలేదని విమర్శించారు. కొంతమంది అధికారులు సంఘామిత్రలను రికార్డులు అప్పగించాలని బెదిరిస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబను కలిసిన సందర్భంలో తొలగింపులకు తమ ప్రభుత్వం వ్యతిరేకమని, ఎవరిని తొలగించమని చెప్తుంటే, కిందిస్తాయి కూటమి నాయకులు ముఖ్యమంత్రి ఆదేశాలను సైతం పట్టించుకోకుండా ప్రజలలో వ్యతిరేకతకు కారణవుతున్నారని పేర్కొన్నారు. తక్షణం చోటా నాయకుల ఆగడాలు అరికట్టకుంటే ఉద్యమించాల్సి ఉంటుందని హెచ్చరించారు. 6 నెలల పెండింగ్ జీతాలు మీద దృష్టి పెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఎపి వెలుగు యానిమేటర్ల సంఘం జిల్లా అధ్యక్షులు రాణెమ్మ, ప్రధాన కార్యదర్శి జి రెడ్డెప్ప, కోశాధికారి సుబ్రహ్మణ్యం, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు పరంజ్యోతి, నాయకులు మాదవయ్య పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎఒకు వినతిపత్రం ఇస్తున్న సిఐటియు నాయకులు

పట్టపగలే ఖాతాదారుల రికార్డులు దగ్ధం

దగ్ధమవుతున్న ఖాతాదారుల రికార్డులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సబ్ కలెక్టర్ కార్యాలయంలో అర్ధరాత్రి రికార్డులు దగ్ధం ఘటన కేసు మరువక ముందే మదనపల్లెలో పట్టపగలే ఓ బ్యాంకుకు సంబంధించిన ఖాతాదారుల రికార్డులను తగలబెట్టారు. పట్టణంలోని హెచ్‌డిబి బ్యాంకుకు సంబంధించిన ఖాతాదారుల రికార్డులను పట్టపగలే ఆ బ్యాంకు ఉద్యోగులే తగులబెట్టడం పలు అనుమానాలకు తావిస్తోంది. పట్టణంలోని సిటిఎం రోడ్‌లో ఉన హెచ్‌డిబి ఫైనాన్షియల్ బ్యాంకుకు సంబంధించిన రికార్డులను గురువారం మధ్యాహ్నం సమయంలో గుట్టు చప్పుడు కాకుండా స్థానిక ఆంజనేయస్వామి ఆలయం వెనుక, బాహుదావంక రోడ్డు ప్రక్కన తగులబెట్టారు. ఈ విషయమై బ్యాంకు మేనేజరును వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పాత రికార్డులను దగ్ధం చేసినట్లు తెలిపారు.

పంట కోత ప్రయోగాలు సక్రమంగా నిర్వహించాలి

- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్రనాయక్

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో పంట కోత ప్రయోగాలు వ్యవసాయ శాఖ సిబ్బంది సక్రమంగా నిర్వహించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్ర నాయక్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో వ్యవసాయ శాఖ, ప్రణాళిక విభాగం ఆధ్వర్యంలో పంటకోత ప్రయోగాలు, ఈ పంట నమోదుపై జిల్లాలోని అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్స్, వ్యవసాయ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట కోత ప్రయోగాలు ఎంపిక కాబడిన పంటల యందు వ్యవసాయ సిబ్బంది సక్రమంగా నిర్వహించాలని వీటి ద్వారా వ్యవ వ్యవసాయ ఉత్పత్తులను అంచనా వేయడం, రుణ ప్రణాళిక తయారు చేస్తామని పేర్కొన్నారు. వ్యవసాయ సిబ్బంది ప్రతి ఒక్కరూ కూడా గ్రామంలోని రైతులు సాగుచేసిన పంటలను ఈ పంట నందు నమోదు చేయాలని దీని ఆధారంగా రైతులకి పంటల బీమా పంట నష్ట పరిహారాలు వర్తిస్తాయని కావున పంట సాగు చేసిన ప్రతి రైతు ఈ పంట నందు నమోదు కావాలని కోరారు. ప్రణాళిక అధికారి వెంకట పెద్దయ్య మాట్లాడుతూ అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్స్ అందరూ కూడా ఈ పంట కొత్త ప్రయోగాల పైన మండల స్థాయిలో వ్యవసాయ సిబ్బందికి శిక్షణ నిర్వహించి తగు జాగ్రత్తలు తెలపాలని కచ్చితత్వంతో కూడిన పంట కోత ప్రయోగాలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో శిక్షణ అధికారి శ్రీనివాసులు, జిల్లాలోని సహాయ వ్యవసాయ సంచాలకులు, వ్యవసాయ అధికారులు, స్టాటిస్టికల్ అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెడి చంద్రనాయక్

రక్తదానం చేయండి.. ప్రాణాలు కాపాడండి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలోని శ్రీనివాస డిగ్రీ కళాశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ మదనపల్లె సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రి రక్త నిధి కేంద్రం పర్యవేక్షణలో జరిగిన రక్తదాన శిబిరంలో 110 యూనిట్లు రక్తం సేకరించారు. నేషనల్ సర్వీస్ స్కీమ్ యూనిట్ (ఎన్ఎస్ఎస్) వాలంటీర్లు చురుగ్గా పాల్గొన్నారు. కళాశాల ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమాన్ని సంస్థ చైర్మన్ ఎన్.కృష్ణారెడ్డి, ప్రిన్సిపల్ బి.కృష్ణారెడ్డి, కరస్పాండెంట్ ఎన్.శ్రీనివాసులురెడ్డి ప్రారంభించారు. లయన్ క్లబ్ జోనల్ చైర్మన్ డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి, లయన్స్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ నివేదిత, పిఆర్ఒ గౌతమ్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ ఎన్.కృష్ణారెడ్డి మాట్లాడుతూ రక్తదానం యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ, రక్తదానం చేయడం అంటేనే ప్రాణాలను కాపాడే కార్యక్రమమని తెలిపారు. 110 యూనిట్లు రక్తం అందించడం పట్ల దాతలను అభినందించారు. భవిష్యత్తులోను సహకారం అందిస్తామని ప్రకటించారు. లయన్స్ జోనల్ చైర్మన్ డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి మాట్లాడుతూ రక్తదాన శిబిరంలో ఉత్సాహంగా విద్యార్థులు, అధ్యాపకులు, స్థానికులు ముందుకు వచ్చి విజయ వంతం చేయడంపైన కృతజ్ఞతలు తెలిపారు. సమాజ హితం కోసం లయన్స్ క్లబ్ చేపట్టే కార్యక్రమంలో సహాయ, సహకారాలు అందించిన రక్తదాతల స్ఫూర్తిని కొనియాడారు. అనంతరం దాతలకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, సిబ్బంది, విద్యార్థులు, లయన్స్ క్లబ్ సభ్యులు జిఇటి మహేష్, బాబులాల్ భండారి, వాసుదేవ్ ప్రసాద్, కెఎస్ఎస్ ప్రసాద్, వెంకటరమణారెడ్డి, డాక్టర్ భార్గవ్ ప్రభుత్వ ఏరియా హాస్పిటల్, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న విద్యార్థులు

పవన్ కల్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

పవన్ కల్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : వరద బీభత్సం నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల ప్రజలను ఆదుకునేందుకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అందించిన రూ.6 కోట్ల విరాళం దేశచరిత్రలో ప్రథమని జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మైఫోర్స్ మహేష్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరదలు వ్యాపించి జనజీవనం అతలాకుతలం కాగా రూ.కోట్లలో ఆస్తి నష్టం సంభవించిందన్నారు. ఆ ప్రాంతవాసులు వరదల్లో సర్వం పోగొట్టుకుని కట్టుబట్టలతో బయటపడ్డారన్నారు. సినీ, రాజకీయ ప్రముఖులు తమ వంతు సాయం ప్రకటించారన్నారు. డిప్యూటీ సిఎం కొణిదెల పవన్ కల్యాణ్ ఇంత వరకు ఏ రాజకీయ నాయకుడు చేయని విధంగా తన సొంత నిధులు రూ.6 కోట్ల విరాళం ప్రకటించడం ప్రతీ రాజకీయ నాయకుడికి రోల్ మోడల్‌గా నిలిచారన్నారు. ఇంత పెద్ద మొత్తంలో ఏ రాజకీయ నాయకుడూ ఇంత వరకు విరాళం ప్రకటించలేదన్నారు. పవన్ ప్రకటించిన విరాళం దేశచరిత్రలో ప్రథమంగా నిలిచిపోతుందని స్పష్టం చేశారు. పవన్ సారధ్యంలో జనసేన పార్టీలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు వివరించారు. అనంతరం పవన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో జనసేన చిత్తూరు జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు అమరనారాయణ, నాయకులు రామ్మూర్తి, చిరంజీవి, రమణ, అయాజ్, పవన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి - కడప : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ సౌత్‌జోన్ అండర్ -23 మల్టీ డే అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా గురువారం వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో కడప, కర్నూలు జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 51.0 ఓవర్లలో 223 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని జాఫర్ అలీఖాన్ 79, శివ కేశవ రాయల్ 40 పరుగులు చేశారు. కర్నూలు జట్టులోని కనీష్ అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 7 వికెట్లు తీసుకున్నాడు. సాయి సూర్య తేజ రెడ్డి రెండు వికెట్లు తీసుకున్నాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 21.4 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 72 పరుగులు చేసింది. కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో అనంతపురం, నెల్లూరు జట్ల మధ్య మ్యాచ్ హోరాహోరీగా సాగుతుంది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 26 ఓవర్లలో 133 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని సుబ్రహ్మణ్యం 58, సోహన్ వర్మ 28 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని మల్లికార్జున 4, లోహిత్ సాయి 3, భార్గవ్ మూడు వికెట్లు తీసుకున్నారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు 48.0 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 235 పరుగుల వద్ద డిక్లేర్ ప్రకటించింది. ఆ జట్టులోని హనీష్ వీరారెడ్డి అద్భుతంగా బ్యాటింగ్ ప్రదర్శించి 114 పరుగులు (సెంచరీ) చేశాడు. రోహిత్ రోషన్ 49 పరుగులు చేశాడు. నెల్లూరు జట్టులోని మాధవ్ 3, భార్గవ్ 2, సుతేజ్ రెడ్డి 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 8.0 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 40 పరుగులు చేసింది.

వరద బాధితులకు రూ.5 లక్షలు వితరణ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాష్ట్రంలో ఇటీవల సంభవించిన తీవ్ర వరదల కారణంగా విజయవాడ, తదితర ప్రాంతాలలో వరద బాధితుల సహాయార్థం అన్నమాచార్య యూనివర్సిటీ వ్యవస్థాపకులు ఛాన్సలర్ డాక్టర్ చొప్పా గంగిరెడ్డి రూ.5 లక్షల విరాళాన్ని ప్రభుత్వానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విరాళం యూనివర్సిటీ సమాజ బాధితపై ఉన్న కట్టుబాటును ఈ విపత్తుల సమయంలో బాధితులకు సహాయపడి వారిలో స్థైర్యం నింపాలనే ఉద్దేశ్యంతో సాయం చేశామన్నారు. ప్రతి వ్యక్తి తమ వంతు సహాయ సహకారాలు అందించి బాధితులకు ధైర్యాన్నిచ్చి వారికి అన్ని సౌకర్యాలు కల్పించి సౌకర్యవంతమైన జీవనం సాగించేందుకు సంఘటితంగా అందరూ ముందుకు రావాలని కోరారు. కళాశాల ఛాన్సలర్ చొప్పా అభిషేక్‌రెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యం విజయవాడపై కన్నెర్రజేయడం చాలా బాధాకరమని తెలిపారు. ఈ కష్టకాలంలో విజయవాడ బాధితులకు తమవంతు సహాయాన్ని అందించడం తమ బాధ్యతగా భావిస్తున్నామన్నారు. కళాశాల వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి మాట్లాడుతూ అందరూ కలిసికట్టుగా విజయవాడ వరద బాధితులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.ఎం.వి.నారాయణ, రిజిస్ట్రార్ డాక్టర్ ఎన్.మల్లికార్జునరావు వరద బాధితులకు సహాయాన్ని అందించిన గంగిరెడ్డి దాతృత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఇటువంటి సమయాలలో పెద్దలందరూ ముందుకు వచ్చి తమవంతు చేయూతను అందించాల్సిందిగా కోరారు.

అక్రమాలపై విచారణ జరపాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : గత ప్రభుత్వ హయాంలో అంగళ్ళు పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన ఎం.టి.జి.ప్రసాద్ పంచాయతీలోని ప్రజలను అధికారాన్ని అడ్డం పెట్టుకొని చాలా ఇబ్బందులకు గురిచేశారని, ప్రస్తుతం చిత్తూరు జిల్లా గంగవరం మండలం ఇఒపి ఆర్‌డిగా విధులు నిర్వహిస్తున్న ఆయన చేసిన అక్రమాలపై విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్‌కు గురువారం టిడిపి రాజంపేట పార్లమెంట్ బిసి సెల్ అధ్యక్షులు పి.సురేంద్ర యాదవ్ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలో నూతనంగా సొంత ఇంటిని నిర్మించతలపెట్టిన పేద ప్రజల దగ్గర నుండి గృహనిర్మాణ అనుమతుల కోసం అక్రమంగా అధిక మొత్తంలో లంచాలను వసూలు చేసి నకిలీ రసీదులు వారికి ఇచ్చారన్నారు. అంగళ్ళు చుట్టుపక్కల గల విలువైన భూముల్లో ప్లాట్స్ వేస్తున్న వ్యాపారస్తుల నుండి లంచాలు తీసుకొని ప్లాన్ అప్రూవల్స్‌లో పంచాయతీకి రావాల్సిన వాటాను పట్టించుకోకుండా వదిలేశారని ఆరోపించారు. ఇప్పుడు ప్రభుత్వ, ప్రజల వసతులకు కావాల్సిన భూములు తగినన్ని లేకపోవడానికి కారణమయ్యాడన్నారు. వ్యవసాయ భూములను కన్వెర్షన్ లేకపోయినా గృహ నిర్మాణానికి అనుమతులు మంజూరు చేశారని, పంచాయతీ ఇంటి పన్నులకు సంబంధించిన బకాయిలను అధిక మొత్తంలో స్వాహా చేశారని, ఇంటిపన్నులో పేరు మార్పుకోసం వచ్చిన ప్రజల దగ్గరనుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేశారని పేర్కొన్నారు. ఇది పూర్తిగా రాజకీయ సహకారంతో చేసి, వాటిని బయటకు రానీయకుండా రాజకీయంగా ప్రజలమీద ఒత్తిడి తెచ్చారని పేర్కొన్నారు. పూర్తిస్థాయి విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. 2019 నుండి 2023 వరకూ బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్స్‌లో రూ.25 వేల నుండి రూ.లక్ష వరకు ప్రజల దగ్గర నుండి వసూలు చేసి నకిలీ రసీదులు ఇచ్చారన్నారు. 2019 నుండి 2023 వరకూ ఇంటిపన్నులో పేరు మార్చుకోసం వచ్చిన వారి నుండి రూ.10 వేల నుండి రూ.50 వేల వరకూ వసూలు చేశారని, 2019 నుండి 2023 వరకూ ఇంటిపన్ను బకాయిలు వసూలు చేసి స్వాహా చేశారని తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

సింహరాజ్‌కు సాహిత్య పురస్కారం

ప్రజాశక్తి - కడప అర్బన్

నెల్లూరుకు చెందిన ప్రముఖకవి, ప్రముఖ వైద్యులు సింహరాజ్ (డాక్టర్ శింగరాజు శ్రీరామకృష్ణ ప్రసాదరావు) 'మహాకవి' డాక్టర్ గడియారం వేంకట శేషశాస్త్రి 43వ సాహిత్య పురస్కారానికి ఎంపికైనట్లు రచన సాహిత్య వేదిక కార్యదర్శి డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పురస్కార ప్రదాన సభ రచన సాహిత్య వేదిక, గడియారం కుటుంబీకుల సంయుక్త ఆధ్వర్యంలో అక్టోబరు 6న నిర్వహించనున్నట్లు తెలిపారు. 1982 నుంచి ప్రతి ఏటా రాష్ట్రస్థాయిలో కావ్యాలకు పోటీ నిర్వహించి ఎంపికైన కావ్యానికి బహూకరిస్తూ వస్తున్న ఈ అవార్డుకు 2024 సంవత్సరానికి సింహరాజ్ రచించిన 'శ్రీ శంభు భారతం' (ఛత్రపతి శంభాజీ పద్య ప్రబంధం) అనే చారిత్రక కావ్యం ఎంపికైనట్లు పేర్కొన్నారు. పురస్కార ప్రదాన సభలో సింహరాజ్‌కు అవార్డు, రూ.10వేలు బహుమతి, ప్రశంసాపత్రం అందజేయనున్నట్లు తెలిపారు.

దేశ నిర్మాణంలో ఎల్ఐసి పాత్ర కీలకం

ప్రజాశక్తి - కడప అర్బన్

వ్యాపారంలో, సేవల్లో, దేశనిర్మాణంలో ఎల్ఐసి పాత్ర కీలకమని సీనియర్ డివిజనల్ మేనేజర్ జి.కె.ఆర్.వి రవికుమార్ అన్నారు. గురువారం బీమా వారోత్సవాల్లో భాగంగా ఎల్ఐసి ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో పెద్ద ఎత్తున ఉద్యోగులు, అధికారులు, ఏజెంట్లు, పాలసీదారులు పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం ఎస్‌డిఎం మాట్లాడుతూ 70 శాతం మార్కెట్ షేర్‌తో ఎల్ఐసి లైఫ్ ఇన్సూరెన్స్ మార్కెట్‌ను శాసిస్తుందని అన్నారు. 98.4 శాతం క్లెయిమ్‌ల చెల్లింపుతో పాలసీదారుల కుటుంబాలకు నమ్మకమైన నేస్తంగా భద్రత కల్పిస్తోందన్నారు. దేశ అభివృద్ధికి అవసరమైన నిధులు అందించడంలో ఎల్ఐసితో సరితూగే ఏ సంస్థ దేశంలో లేదన్నారు. టెక్నాలజీ, నైపుణ్యాలు, వేగం ఇలా ఏ అంశం తీసుకున్నా ఎల్ఐసి ప్రపంచ ప్రమాణాలతో పనిచేస్తూ ఉందన్నారు. జీవన్ ఉత్సవ్, జీవన్ ధారా 2, జీవన్ శాంతి, నివేష్ ప్లస్ లాంటి పాలసీలను ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు. ర్యాలీలో మార్కెటింగ్ మేనేజర్ శ్యాంసుందర్రావు, సేల్స్ మేనేజర్ సాల్మన్ రాజు, కడప శాఖాధిపతులు శ్రీనాథ్ రెడ్డి, వెంకటకృష్ణ, సంఘాల ప్రతినిధులు నిత్యానంద రెడ్డి, చంద్రపాల్, సంజయ్, రఘునాథరెడ్డి, అవధానం శ్రీనివాస్, సుధీకర్, రామాంజనేయులు, రెడ్డి భాస్కర్, హబీబుల్లా ఖాన్ పాల్గొన్నారు.

నీటి సంపులో పడి విద్యార్థి మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మృతి చెందిన నవ్యశ్రీ

నీటి సంపులో పడి విద్యార్థి మృతి చెందిన విషాద ఘటన గురువారం మదనపల్లెలో వెలుగు చూసింది. తాలూకా ఎస్ఐ పి.వి.రమణ తెలిపిన వివరాల మేరకు.. స్థానికంగా కాపురం ఉంటున్న సోమశేఖర్, సునీత దంపతుల కుమార్తె నవ్యశ్రీ(9) మూడో తరగతి చదువుతోంది. నవ్యశ్రీకి మతిస్థిమితం సరగాలేని దివ్యాంగురాలు. ఈ క్రమంలో తన ఇంటి ఆవరణలోని పెరట్లోకి వెళ్లి ప్రమాదవశాత్తు నీటి సంపులో పడింది. గమనించిన కుటుంబీకులు వెంటనే బాలికను బయటకు తీసి చికిత్స కోసం మదనపల్లి సర్వజన బోధనాస్పత్రికి తర లించారు. పరీక్షించిన వైద్యులు విద్యార్థి చనిపోయినట్లు నిర్ధారించారు. స్కూల్‌కు వెళ్లాల్సిన కుమార్తె కళ్లముందే కానరాని లోకాలకు వెళ్లిపోవడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

డెంగీ నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో డెంగీ నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి వైద్యాధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో డెంగీ, మలేరియా వంట సీజనల్ వ్యాధులపై మెడికల్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ నివారణకు వైద్యాధికారులు సమన్వయంతో పనిచేసి డెంగీ కేసులను పూర్తిగా నివారించాలన్నారు. జిల్లాలోని మదనపల్లి ప్రాంతంలో డెంగీ కేసులు అధికంగా ఉన్నాయని వీటి నివారణకు మెడికల్ క్యాంపులు విరివిగా ఏర్పాటు చేసి డెంగీ వ్యాధులను నివారించాలని పేర్కొన్నారు. జిల్లాలో ఎక్కడైనా డెంగీ వ్యాధి సోకినట్లయితే వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తక్షణమే అక్కడికి వెళ్లి వారికి మానవతా దృక్పథంతో మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. గతంలో ఎక్కువ కేసులు వచ్చిన ప్రాంతాల్లో అధికా రులు పర్యటించాలని, అక్కడ ప్రజలకు మలేరియ, డెంగ్యూ వ్యాధులపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. దోమలను అరికట్టాలంటే మానవ ప్రయత్నం పకడ్బందీగా చేపట్టాలన్నారు. లార్వా స్టేజి నుంచి దోమలను అరిక ట్టడం చేయాలన్నారు. జిల్లాలోని పిహెచ్‌సిలలో మందుల కొరత ఉన్నట్లయితే వెంటనే తమకు రిపోర్ట్ పంపాలని పేర్కొన్నారు. దోమల వల్ల వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ఎంపిడిఒలు, పంచాయతీ కార్యదర్శులు గ్రామాలలో పారిశుధ్య కార్యక్రమాలు విరివిగా చేపట్టి దోమల వృద్ధి చెందకుండా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో డెంగు మలేరియాతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారనే ఫిర్యాదులు రాకుండా వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టి వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. మెడికల్ ఆఫీసర్లు డెంగీ, మలేరియా వ్యాధులు సంబంధించి రోజు వారి డేటా పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలని పేర్కొన్నారు. దోమలు నివారణకు ప్రతి ఒక్కరూ పనిచేయాలని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య, జిల్లాలోని మెడికల్ ఆఫీసర్లు, తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి రాంప్రసాద్‌రెడ్డి జిల్లాకు రాక

ప్రజాశక్తి-రాయచోటి

రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి శుక్రవారం జిల్లాకు రానున్నారని కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంత్రి శుక్రవారం ఉదయం ఐదు గంటలకు విజయవాడ నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి 11 గంటలకు రాయచోటిలోని తమ క్యాంపు కార్యాలయానికి చేరుకుంటారని పేర్కొన్నారు. అనంతరం మంత్రి ప్రజలకు అందుబాటులో ఉంటూ స్థానిక కార్యక్రమాలలో పాల్గొంటారని తెలిపారు.

ఉపాధ్యాయురాలితో మాట్లాడుతున్న ఎంపిడిఒ రమేష్‌బాబు

'కెజిబివి'లో ఎంపిడిఒ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండల పరిధిలోని ముష్టూరు గ్రామంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని ఎంపిడిఒ రమేష్ బాబు గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెజిబివి పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసినట్లు తెలిపారు. పాఠశాలలోని హాస్టల్, వంట గదుల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థుల హాజరు పట్టికలను పరిశీలించి, విద్యార్థులకు అందిస్తున్న అల్పాహారం, భోజనం నాణ్యత పై విద్యార్థులతో చర్చించినట్లు తెలిపారు. ప్రతి విద్యార్థి ఉత్తమ విద్యను అభ్యసించేలా ఉపాధ్యాయులు విద్యను బోధించాలని తెలిపారు. పాఠశాలలో విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు అందుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ముని వెంకటమ్మ, ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.

రామసముద్రం : ఉపాధ్యాయురాలు హేమలతను సన్మానిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి-రామసముద్రం

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని ఈస్ట్ పాఠశాలలో పనిచేస్తూ ఉపాధ్యాయ వృత్తిలో ఉత్తమ సేవలందించిన ప్రధానోపా ధ్యాయురాలు కె. హేమలతకు అన్నమయ్య జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా జిల్లా విద్యాశాఖ అవార్డును ప్రకటించింది. ఈ అవార్డును జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ , రాజంపేట ఎమ్మెల్యే ఆకెపాటి అమరనాథ్, డిఇఒ చేతుల మీదుగా స్వీకరించారు. **రాజంపేట అర్బన్ :** మండల పరిధిలోని కొత్త బోయినపల్లె ఎస్‌జెఎస్‌ఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయులు సంగరాజు వెంకటరమణ రాజు హిందీ ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఆయనకు రాయచోటిలోని లయ గార్డెన్‌లో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఘనంగా జరిగిన గురు పూజోత్సవం వేడుకల్లో ముఖ్య అతిథులు జిల్లాకలెక్టర్ శ్రీధర్ చామకూరి, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, డిఇఒ శివప్రకాష్ రెడ్డి చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకున్నారు. **మదనపల్లి అర్బన్ :** మదనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సుబ్బారెడ్డి జిల్లా ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. కలెక్టర్, డిఇఒ చేతులమీదుగా సుబ్బారెడ్డి జిల్లా ఉత్తమ ప్రధానోపాధ్యాయుడి అవార్డును అందుకున్నారు. **కలికిరి:** మండలంలోని మేడికుర్తి పంచాయతీ కురవపల్లె ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయునికి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపికయ్యారు. కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని అందుకున్నారు. ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎపికైన నెలకంటిపే డిఇఒ శివ ప్రకాష్, ఎంఇఒ కరీముల్లా, సహచర ఉపాధ్యాయులు అభినందించారు. **బి.కొత్తకోట:** 1998 డిఎస్‌సి ద్వారా ఉపాధ్యాయ వృత్తి చేపట్టిన బాచే లక్ష్మీపతి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకోవడం గర్వకారణమని జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు గుర్రంకొండ నరసింహ హర్షం వ్యక్తం చేశారు. **పుల్లంపేట:** మండల పరిధిలోని ఆరు ఉప్పరపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న ఎస్ ఉమామహేశ్వర్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక అయ్యారు. కలెక్టర్, డిఇఒ సమక్షంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1998 బ్యాచ్‌లో ఉపాధ్యాయుడిగా ఎంపికై జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక అవడం ఆనందంగా ఉందని తెలియజేశారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన ఉమామహేశ్వరరావు, ఎస్‌టియు జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ బుదరవు నరేంద్రనాథ్, సయ్యద్ సర్దార్ హుస్సేన్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

కొండూరు రెడ్డెయ్యరాజుకు సోప్స్ అవార్డు

ప్రజాశక్తి-సుండుపల్లె: భారత సేవా సంస్థ ఐఎస్ఒ ఆధ్వర్యంలో సోప్స్ ఫౌండేషన్ గుంటూరు శ్రీసర్వేపల్లి రాధా కృష్ణన్ ఆచార్య దేవోభవ నేషనల్ అవార్డును విశిష్ట చైతన్య పాఠశాల అధినేత రెడ్డెయ్యరాజుకు అందించారు. సమాజంలో అట్టగ్రౌండ్ బడిన వర్గాల వారి మేల్కొలుపుకోసం కళలు, సాహిత్యం, కవిత్వం, పద్య పఠనం, ఆధ్యాత్మిక మొదలగు రంగాలలో విశిష్ట సేవలను గుర్తించి సోప్స్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్.కొండల్ రావ్ ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా జాతీయ పురస్కారాన్ని అందించారు. ఈ సందర్భంగా రెడ్డెయ్య రాజును విశిష్ట చైతన్య పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

విద్యుత్ అధికారుల తీరు సరికాదు

ప్రజాశక్తి - రామసముద్రం

వినాయకస్వామి మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా తాత్కాలిక విద్యుత్ సర్వీసు పొందాలని విద్యుత్ శాఖ అధికారులు ప్రకటించినట్లు సమాచారం. తాత్కాలిక విద్యుత్ సర్వీస్ కొరకు 500 వాట్స్ విద్యుత్ వాడకానికి రూ. 1100, 500 వాట్స్ నుంచి1000 వాట్స్‌కు రూ.2350, 1000 వాట్స్ నుంచి 1500 వాట్స్‌కు రూ.3100, 1500 వాట్స్ నుంచి 2000 వాట్స్‌కు రూ.3850 చెల్లించి మీసేవా కేంద్రాల్లో తాత్కాలిక సర్వీసులు తీసుకోవాలని సోషియల్ మీడియాలో వార్తలు హల్చల్ చేయడంతో ప్రజలు విస్మయపోయారు. ఇదే నిజమైతే వినాయక మండపాల నిర్వాహకులు సబ్ స్టేషన్ ముట్టడి చేస్తామని అంటున్నారు. ఓ వైపు పోలీసు స్టేషన్లో విగ్రహాల నిర్వాహకులు ఆన్‌లైన్లో అనుమతులు తీసుకోవాలని అక్కడ అనుమతులు పొందాక లైన్ లింక్ ద్వారా విద్యుత్ శాఖ ద్వారా అనుమతులు పొందాల్సి ఉంది. పోలీసు శాఖలో అనుమతులు లేకుండే విద్యుత్ శాఖలో అనుమతులు లేనట్లే.

కంటి వెలుగు పథకానికి మంగళం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

గ్రామీణ నిరుపేదలకు కంటి చూపు కలిగించేందుకు కంటి వెలుగు పథకాన్ని గత ప్రభుత్వాలు అమలు చేశాయి. ఈ పథకాన్ని ఆపోలో కంపెనీ ప్రాజెక్టు అప్పగించారు. గత ప్రభుత్వాలు ఇన్ని అమలు పరిచిన పథకం ఆపోలో ప్రాజెక్టు కాంట్రాక్ట్ గడువు గురువారంతో ముగిసింది. కూటమి ప్రభుత్వం ఆ ప్రాజెక్టు రెన్యువల్‌కు అనుమతించకపోవడంతో ఈ సేవలను నిలిపివేయమని ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. కంటి అద్దాల కోసం వచ్చి వృద్ధులు పరీక్షలు నిలిపి వేశారని తెలియడంతో నిరాశ వ్యక్తం చేశారు.

వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

పట్టణంలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. వినాయక చవితి రెండు రోజులు ముందే పట్టణంలో తీవ్ర రద్దీ నెలకొని వినాయక చవితికి సంబంధించిన పూజా సామగ్రి, పండ్ల విక్రయంతో దుకాణాలు రోడ్ల ప్రక్కనే ఏర్పాటు చేయడం వలన రద్దీ పెరిగి వాహనాలు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. ప్రతిరోజూ ఉదయం, సాయంకాలం వాహనాల రాకపోకలు అధికంగా ఉండడంతో టోల్గేట్ సెంటర్, పాత బస్టాండ్ సెంటర్ వద్ద వాహనాల రాకపోకలకు ఆటంకం కలుగుతోంది. పోలీసు యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించి వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డుకు అడ్డంగా ఉన్న వాహనాలు

భవిష్యత్ నిర్మాతలు ఉపాధ్యాయులు

కలికిరి : సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-కలికిరి

విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించినప్పుడే ఉన్నత శిఖరాలు చేరుకుంటారని ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కలికిరి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని అన్నారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవ ప్రదమైనదని అన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించినప్పుడే విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని అన్నారు. అనంతరం వన మహోత్సవం పాల్గొని ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల ఆవరణంలో చెట్లును నాటారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ విజయ్‌కుమార్, హెచ్‌ఎం శారద ఎమ్మెల్యేకి పోలమాలవేసి, శాలువతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీలేరు నియోజకవర్గ జనసేన అధ్యక్షుడు బెజవాడ దినేష్, మండల ఇన్‌ఛార్జి అస్లాంబాషా, టిడిపి మండల అధ్యక్షుడు నిజాముద్దీన్, ఎంపిడిఒ గంగయ్య, ఎంఇఒలు కరిముల్లా, నాగార్జునరెడ్డి , మేజర్ పంచాయతీ తాత్కాలిక సర్పంచ్ ఎల్లయ్య, టిడిపి నాయకులు ఎర్రం రెడ్డి, అగస్తేశ్వర్ పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** స్థానిక ఆదర్శ పాఠశాలలో డాక్టర్ ఎం.శీనునాయక్ ఆధ్వర్యంలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసినటువంటి ఎంఇఒ రెడ్డిశేఖరుని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానిం చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హనుమంత్ రెడ్డి, నరేంద్రనాయక్, నాగసాయి ,లీల, నూర్, మొహమ్మద్, స్వామినాథన్, ప్రవల్లిక, శివశంకర్ రెడ్డి, గాయత్రి, ప్రత్యూష, ఉష, కేశవులు బోధనేతర సిబ్బంది బాలసుబ్రమణ్యం,సురేష్ పాల్గొన్నారు. **వీరబల్లి :** ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ అజంతుల్లా ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రఘురామయ్య మాట్లాడుతూ గురువు విద్యార్థులు పాఠశాలలో పాటు జీవిత పాఠాలను కూడా మెరుపుతాడని, సంస్కారంలో కూడిన ఉద్యను నేర్చుకోవాలి అని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు చంద్రశేఖర్, రమేష్ రాజు, ప్రసాద్, వేణుగోపాల్, అరుణమ్మ, చంద్రకళ, విద్యార్థులు పాల్గొన్నారు. **కలకడ :** విద్యార్థుల భవిష్యత్తుకు ఉపాధ్యాయుల సేవలే కీలకమైనవని పాఠశాల కమిటీ చైర్మన్ రమేష్ కొనియాడారు. మండల కేంద్రమైన కలకడ ఆదర్శ పాఠశాల కలకడ, కోన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మలంషావలి, అనిత, ప్రధానోపాధ్యాయులు చంగల్ రాయుడు, సరస్వతి, విద్యార్థులు పాల్గొన్నారు. **రామాపురం :** మండల పరిధిలోని డాక్టర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఆర్ట్స్ మాస్టర్‌గా పనిచేస్తున్న డి. ఆనంద్‌రాజు తన రక్తంతో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జన్మదిన సందర్భంగా ఆయన చిత్రపటాన్ని చిత్రీకరించారు. **రాజంపేట అర్బన్ :** విజన్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మండల విద్యాశాఖ కార్యాలయంలో ఉపాధ్యా యులను ఘనంగా సన్మానించారు.

కార్యక్రమంలో ఎంఇఒ-2 సుబ్బరాయుడు, ఎస్‌టియు రాష్ట్ర నాయకులు సుబ్రమణ్యంరాజు, విజన్స్ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి ఏ.వెంకటసుబ్బయ్య నాయుడు, పట్టుపోగుల ఆదినారాయణ, పి.సూర్యచంద్ర పాల్గొన్నారు. **పుల్లంపేట:** మండల పరిధిలోని శ్రీ ప్రత్యూష హై స్కూల్, శ్రీ శాంతినికేతన్ హై స్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొత్తపేట ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రత్యూష కరస్పాండెంట్ కాసుల భాను ప్రకాష్, శాంతినికేతన్ కరస్పాండెంట్ అవ్వారు శ్రీనివాసులు, రవీంద్రబాబు, ప్రసన్న, వాసు దేవరాజు, సరళమ్మ, ఈశ్వరయ్య, మాధవి లత, రహిమాన్, రెడ్డమ్మ పాల్గొన్నారు. **మదనపల్లి :** మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్ర మంలో ఆర్‌ఆర్ ఆర్ ప్రెసిడెంట్ నాదెళ్ల ద్వారకానాథ్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్ అతిథులు శ్రీ సర్వే పల్లి రాధాకృష్ణ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎన్‌సి సి కో-ఆర్డినేటర్ రాజేష్, ఇంటర్నేషనల్ రిలేషన్స్ సీనియర్ మేనేజర్ విజయలక్ష్మి, తుసీరామ్ నాయుడు, అధ్యాపకులు పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేవారు గురువులే అని లక్కిరెడ్డిపల్లి మండల పరిషత్ ప్రైమరీ స్కూల్ పాఠశాల కమిటీ చైర్మన్ ప్రమీల పేర్కొన్నారు. లక్కిరెడ్డిపల్లి మండల పరిషత్ ప్రైమరీ పాఠశాల నుండి ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాంశాల ప్రధానోపాధ్యాయులు వేమిరెడ్డి సుబ్బారెడ్డి, చంద్రమౌళి, పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు. **రాయచోటి టౌన్ :** భావి భారత పౌరులైన విద్యార్థులకు మంచి బోధన అందించి బలమైన పౌరులుగా తీర్చిదిద్ది దేశాన్న పటిష్ట స్థితిలోకి తీసుకెళ్లేవారే ఉపాధ్యాయుడు అని అలిమాబాద్ ఉర్దూ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జాబిర్ అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అమానత్ సేవా సొసైటీ అధ్యక్షులు అతావుల్లా, దస్తగీర్, ఇమ్రాన్ ఉపాధ్యాయులు మహమ్మద్ ఇలియాస్, మహమ్మద్‌బాషా పాల్గొన్నారు. **నందలూరు :** మండలంలోని నాగిరెడ్డిపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు జయలలితకుమారి ఆధ్వర్యంలో ఎంఇఒలు నాగయ్య, అనంతకృష్ణలు, ఉపాధ్యాయులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు డాక్టర్ నాగేంద్రప్రసాద్, గంగనపల్లి వెంకటరమణ, శిల్పి ఆనందచారి, సుబ్బరాయుడు, గొంటుముక్కల వెంకటరమణ పాల్గొన్నారు. **చిన్నమండెం :** మండల పరిధిలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలందు, ఆదర్శ పాఠశాల, కస్తూరిబా బాలిక విద్యాలయం నందు గురుపూజోత్సవం ను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల భవిష్యత్తుకు ఉపాధ్యాయుల సేవలే కీలకమని పాఠశాల కమిటీ చైర్మన్ తెలిపారు. **మదనపల్లె అర్బన్ :** చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థచే నడపబడుతున్న ముత్తు ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో గురుపూజోత్సవ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అజయ్, గౌసియా బేగం, రెడ్డి ప్రసన్న, రెడ్డి శంకర్, సుప్రజ, సుమలత, బోధనేతర సిబ్బంది ప్రమీల, వెంకటేశ్వర ప్రసాద్,సురేంద్రలు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె : సన్మానం పొందిన ఉపాధ్యాయులతో విద్యార్థులు

వినాయక మండపాలకు అనుమతి తప్పనిసరి

సూచనలు ఇస్తున్న తహశీల్దార్ ధనుంజయలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండల పరిధిలో ఏర్పాటు చేస్తున్న వినాయక చవితి మండపాలకు ఉత్సవ కమిటీ సభ్యులు అధికారుల నుంచి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని తహశీల్దార్ ధనుంజయలు తెలిపారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఎంపిడిఒ రమేష్‌బాబు, మండల అధికారులు, కుల, మత పెద్దలతో, శాంతియుత కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి పండుగ సందర్భంగా ఏర్పాటు చేసే మండపాలకు రెవెన్యూ, పోలీసు, విద్యుత్ శాఖల నుంచి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. కుల, మతాలకు అతీతంగా వినాయక చవితి పండుగను పెద్దలు, యువత పెద్ద ఎత్తున నిర్వహించడం జరుగుతుందన్నారు. వినాయక చవితి ఉత్సవ కమిటీ సభ్యులు శాంతియుతంగా పండుగను జరుపుకోవడానికి పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. మట్టి విగ్రహాలను మాత్రమే ఏర్పాటు చేసుకొని పూజించాలన్నారు. పర్యావరణానికి హాని కలిగించే పిఒపితో తయారైన విగ్రహాలను ఉపయోగించరాదని సూచించారు. ట్రాఫిక్ కు అంతరాయం కలిగించేలా రోడ్లపై విగ్రహాలను ఏర్పాటు చేయరాదన్నారు. ఉదయం 6 నుంచి రాత్రి10 గంటల వరకు మాత్రమే పూజా కార్యక్రమాలను నిర్వహిం చుకోవాలన్నారు. ఆ తరువాత ఎటువంటి లౌడ్ స్పీకర్లకు, పూజలు నిర్వహిం చటానికి అనుమతులు లేవన్నారు. మండపాల వద్ద అశ్లీల నృత్యాలు ప్రదర్శిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఊరేగింపు సమయంలో ఎటువంటి అవాం ఛనీయ సంఘటనలు జరగకుండా కమిటీ సభ్యులు, అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. బాణాసంచా విక్రయిం చకూడదని, ఉపయోగించకూడదని పేర్కొన్నారు. మండపాల నిర్వహణకు విద్యుత్ శాఖకు సుమారు రూ.1100ల రుసుము చెల్లించాల్సి ఉంటుందని విద్యుత్ శాఖ ఎఇ వసంత రెడ్డి తెలిపారు. మట్టి విగ్రహాలను ఉపయోగించడం ద్వారా నీటి కాలుష్యాన్ని, పర్యావరణాన్ని రక్షించవచ్చని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రాంప్రసాద్, హెడ్ కానిస్టేబుల్ చక్రవర్తి, ఏఈలు వసంత రెడ్డి, శ్రీహరి రెడ్డి, టిడిపి నాయకులు రాజన్న, మల్లప్ప, మేష రామకృష్ణ, ఖాసింఖాన్, జనసేన మండలాధ్యక్షులు ప్రదీప్ సింగ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. **మదనపల్లి అర్బన్ :** వినాయక విగ్రహాల మండపాల ఏర్పాటు కు అనుమతి తప్పనిసరి అని మదనపల్లె తాలూకా సిఐ కళా వెంకటరమణ,ఎస్ఐ రమణలు తెలిపారు. గురువారం స్థానిక పోలీసు స్టేషన్ వద్ద వారు విలేకరులతో మాట్లాడుతూ వినాయక చవితి పండుగ పర్వదినాన్ని ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, సంప్రదాయ బద్ధంగా జరుపుకోవాలని తెలిపారు. ముఖ్యంగా వినాయక మండపాల ఏర్పాట్లకు ఆయా కమిటీలు తప్పనిసరిగా పోలీసు అనుమతి తీసుకోవాలని, సౌండ్ సిస్టంను రాత్రి వేళల్లో పూర్తిగా నిలిపి వేయాలన్నారు. అదే విధంగా ఊరేగింపు వివరాలను పోలీసులకు తెలియజేస్తే తగిన భద్రతను కల్పిస్తామన్నారు.

వరద బాధితులను ఆదుకుందాం : 'యల్లటూరు'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

జనసేన పార్టీ రాజంపేట పార్లమెంటు ఇన్‌ఛార్జి యల్లటూరు శ్రీనివాసరాజు విజయవాడలోని వరద బాధితులకు అండగా నిలిచి తన వంతు సాయంగా వారికి ఆహార పదార్థాలు అందిస్తున్నారు. యల్లటూరు సహకారంతో వారి బృందం గురువారం నిస్సహాయ స్థితిలో ఉన్న వరద బాధితులకుపాల ప్యాకెట్లు, మంచి నీరు, బ్రెడ్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి విపత్కర పరిస్థితులు, ప్రకృతి వైపరీత్యం నడుమ శ్రమిస్తున్న ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్, మంత్రులు, అధికారులు కష్టపడే విధానం స్ఫూర్తిదాయకమన్నారు. **బి.కొత్తకోట :** విజయవాడ వరద బాధితుల కోసం విరాళాలు సేకరణ కార్యక్రమానికి ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎల్.ప్రసాద్ ఆధ్వర్యంలో శ్రీకారం చుట్టారు. వరద బాధితులకు విరాళం సేకరణలో భాగంగా కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు బృందం స్థానిక రంగసముద్రం రోడ్డు నుంచి నగర పంచాయతీ మీదుగా దిగవ బస్టాండ్, జ్యోతి చౌక్ వరకు ర్యాలీ నిర్వహించి విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ భారీ వర్షాల కారణంగా విజయవాడ, కోస్తా జిల్లాల్లోని పలు గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయని వారికి అండగా నిలవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందని పిలుపునిచ్చారు. **లక్కిరెడ్డిపల్లి :** విజయవాడలోని వరద బాధితులకు లక్కిరెడ్డిపల్లి మండల టిడిపి ప్రచార కార్యదర్శి యనుముల విశ్వనాథ్ వరద బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.5వేలు తహశీల్దార్ సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవతా దృక్పథంతో ప్రతి ఒక్కరూ వారి స్తోమతకు తగ్గ ఆర్థిక సాయం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ స్కూల్ కమిటీ చైర్మన్ మనీ కృష్ణ, కావలిఅంజి, రౌతుశంకర్, రెడ్డిశేఖర్, సహదేవ, ప్రసాద్ పాల్గొన్నారు.

బి.కొత్తకోట : విరాళాలు సేకరిస్తున్న విద్యార్థులు

నిధులు దుర్వినియోగంపై విచారణ

ప్రజాశక్తి-సుండుపల్లె

మండంలోని ఎంపిడిఒ కార్యాలయ నిధుల దుర్వినియోగంపై మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు బండి ఈశ్వర్ కలెక్టర్, జెసిలకు గత నెలలో ఫిర్యాదు చేశారు. మండల జనరల్ ఫండ్‌లో రూ.11,98,628లు వివిద వ్యక్తుల పేర్ల మీద 15వ ఆర్థిక సంఘం నిధులలో మూడే ప్రవీణ్‌నాయక్ పేరు మీద రూ.135515లు , లక్కిరెడ్డిపల్లె మండలానికి చెందిన పెద్దిరెడ్డి సురెంద్ర రెడ్డి పేరు మీద రూ.12,44,446లు ఎలాంటి పనులు చేయకుండానే పనులు చేసినట్లు బిల్లులు చెల్లించినట్లు ఫిర్యాదు పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం కింద చేసిన పనులకు రెండొవ సారి ఎంపిపి గ్రాంటు కింద సిసి రోడ్లు వేసినట్లు మళ్ళీ బిల్లులు పెట్టుకొని నిధులు స్వాహా చేసినట్లు తెలిపారు. మడితాటి గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా వీధి దీపాలు కోసం రూ.8 లక్షలు గ్రాంట్‌లో బిల్లులు చేసుకొన్నారని, పెద్ద బలిజ పల్లికి రోడ్డు వేయకున్నా కూడ వేసినట్లు బిల్లులు పెట్టుకొన్నట్లు విషయం కూడా డిప్యూటీ జడ్‌పి సిఇఒ దృష్టికి తీసుకెళ్ళినట్లు తెలిపారు. ఆ ఫిర్యాదు మేరకు గురువారం జడ్‌పి డిప్యూటీ సిఇఒ రమణారెడ్డి ఎంపిడిఒ కార్యాలయంలో విచారణ చేశారు. దస్త్రాలు తనిఖీ చేశారు. దుర్వినియోగం చేసిన వారిపై చర్యలు తీసుకుని మండల అభివృద్ధి నిధులు సక్రమంగా ప్రజల సమస్యలపై ఖర్చు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎంపిడిఒ కార్యాలయంలో విచారణ చేస్తున్న జడ్‌పి డిప్యూటీ సిఇఒ

హమాలీలకు టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

బిసిజి టీకాతో క్షయ దూరం

- డాక్టర్ చిన్నరెడ్డెప్ప

ప్రజాశక్తి-కలికిరి

క్షయ వ్యాధి లేని సమాజం కొరకే పెద్దలకు బిసిజి టీకాలు ప్రభుత్వం ప్రవేశపెట్టిందని హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, టిబి పర్యవేక్షకులు నాగిరెడ్డి అన్నారు. డిఎంహెచ్ఒ ఆదేశాల మేరకు మండలంలోని మెడికుర్తి పిహెచ్‌సి పరిధిలోని గుట్టపాలెం గ్రామంలో డాక్టర్ చిన్న రెడ్డెప్ప పర్యవేక్షణలో స్వయం సహాయక బృంద సభ్యులకుపెద్దల బిసిజి టీకా ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సోమ, గురువారాల్లో పెద్దలకు టిబి రాకుండా బిసిజి టీకాలు ఆరోగ్య కేంద్రాల్లో వేస్తారని తెలిపారు. 60 సంవత్సరాలు పైబడిన వారు, షుగర్ వ్యాధి గ్రస్తులు, బీడీ, సిగరెట్ తాగువారు, టిబి వచ్చి తగ్గిపోయి బాగైన వారు, టిబి రోగితో కలిసి జీవించేవారు, ఎత్తుకు తగ్గ బరువు 18 కిలోల కంటే తక్కువ ఉన్న వారు టీకా తప్పనిసరిగా వేసుకోవాలని తెలిపారు. అనంతరం సిఆర్‌పిఎఫ్ బెటాలియన్ పరిధిలో పనిచేస్తున్న హమాలీలకు బిసిజి టీకా వేశారు. కార్యక్రమంలో వెలుగు సిసి ప్రభాకర్, ఎంఎల్‌హెచ్‌పి కృష్ణ కుమారి, ఎఎన్‌ఎంలు రమాదేవి, పార్వతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కలకడ : విద్యార్థులతో మాట్లాడుతున్న డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి

సమతుల్యమైన ఆహారంతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి-కలకడ

విద్యార్థులకు డెంగీ, రక్తహీనతపై అవగాహన కల్పించినట్లు ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎం వి కిషోర్ కుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఎర్రకోటపల్లి పిహెచ్‌సి పరిధిలోని ముడియం వారి గ్రామంలో ప్రజలు, పాఠశాల విద్యార్థులకు డెంగీ, రక్తహీనతపై అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించడం, కిటికీలకు మెష్ కొట్టించుకోవడం, ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం, తాగు నీరు కాచి చల్లార్చి తాగడం వంటి జాగ్రత్తలు పాటించాలన్నారు. గర్భిణులు, బాలింతలు,కిశోర బాలికలు రక్తహీనతకు గురికాకుండా ఐరెన్ ఎక్కువగా ఉన్న ఆహారం బెల్లం చిక్కీలు, గోంగూర పప్పు, బీట్‌రూట్, తాలింపు, బెల్లంతో చేసిన పిండి వంటలు, దానిమ్మ పళ్ళు, మునగ ఆకు, పాలకు ,పాలు, కోడిగుడ్లు, రాగి జావా,రాగి రోట్టి, సంగటి వంటి ఆహారం,మొలకెత్తు ధాన్యాలు తినాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ జయరామయ్య,,ఆరోగ్య పర్యవేక్షకులు వెంకటేశ్వరరావు ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు. **కలికిరి :** సమతుల్యమైన ఆహారంతోనే పిల్లలు, తల్లులు ఆరోగ్యంగా ఉంటారని ఐసిడిఎస్ వాల్మీకిపురం ప్రాజెక్టు సిడిపిఒ భారతి అన్నారు. పోషణ మాసోత్సవాలు సందర్భంగా కిషోర బాలికలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. మేడుకుర్తి వైద్యాధికారి చిన్న రెడ్డప్ప మాట్లాడుతూ రక్తహీనత గురించి చేతులు శుభ్రత గురించి వివరిం చారు. డాక్టర్ కావ్యగంధ ఐరన్ ఉండే ఆహార పదార్థాల గురించి వివరించారు. ఆరు నెలలు పూర్తి అయినా బిడ్డలకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమలో సూపర్‌వైజర్ సత్తాజ్, అంగన్వాడీ కార్యకర్తలు, తల్లులు, కిషోర బాలికలు పాల్గొన్నారు.

కె.రాచపల్లిలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని కొత్తపేట గ్రామపంచాయతీ పరిధిలోని కె.రాచపల్లి గ్రామంలో గురువారం డాక్టర్ మనోజ్‌చంద్ర ఆధ్వర్యంలో గ్రామస్థాయి సిబ్బందితో కలిసి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరంలో ఎంపిడిఒ రఘురాం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. డాక్టర్ మనోజ్ చంద్ర మాట్లాడుతూ దాదాపు 60 మందిని పరీక్షించి వారికి సాధారణ జలుబు, దగ్గు వైరల్ సంబంధించి సమస్యలను గుర్తించి మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. అనుమానితులుగా ఉన్న ఆరుగురికి ఆర్‌డిటి కిట్ ద్వారా రక్త నమూనాలు సేకరించి పరీక్షించినట్లు తెలిపారు. రీజనల్ వ్యాధులలో భాగంగా దోమల ద్వారా వ్యాపించే మలేరియా, ఫైలేరియా, డెంగీ, చికెన్ గున్యా వ్యాధులపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. దోమకాటు ఆరోగ్యానికి చేటు, దోమల నివారణ చర్యలు పాటించండి- ఆరోగ్యంగా జీవించండి, మన ఇల్లు ఇంటి చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రై డే - ఫ్రైడే పాటించాలని అన్నారు. నిల్వ ఉన్న నీటి కుంటలు, లోతట్టు ప్రాంతాలు, నిర్మాణ స్థలాలు, చెరువులో, వాడని నీటి బావులు, దోమల వృద్ధికి నిలయమని అన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ మనోజ్‌చంద్ర

క్రైం కార్నర్

కారు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కారు ఢీకొని ఇద్దరు తీవ్రంగా గాయపడినట్లు మదనపల్లె తాలూకా ఎస్ఐ పివి.రమణ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. కలకడ మండలం, గజ్జల కుంటపల్లెకు చెందిన ఆసీఫ్(22), హంహీర్(20)లు గురువారం ద్విచక్రవానంలో మదనపల్లెకు బయలుదేరినట్లు తెలిపారు. మార్గ మధ్యంలోని ఆరోగ్యవరం మెడికల్ కళాశాల వద్ద వీరి బైక్‌ను కారు ఢీకొట్టినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను 108లో జిల్లా సర్వజన బోధనాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆసీఫ్ పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతి కి రెఫర్ చేశారు. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- కలకడ : విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. మండలంలోని దేవులపల్లి పంచాయతీ దేవలపల్లి దిగువ దళితవాడకు చెందిన మండెం వెంకటేష్ కుమారుడు మండెం ఓబులేసు(46) గత నెల 26న తన ఇంటిలో విద్యుత్ రాకపోవడంతో విద్యుత్ స్తంభం ఎక్కి మరమ్మతులు చేపట్టినట్లు తెలిపారు. ఈ క్రమంలో విద్యుత్ షాక్ గురై క్రింద పడడంతో గాయాలు పాలు కావడంతో తిరుపతి రూయా వైద్యశాలకు తరలించి వైద్య సేవలు అందిస్తుండగా బుధవారం మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.